APTEL /25/A2478

# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 40 గుంటూరు, సోమవారం 20- 10 - 2025 పేజీలు : 4 వెల. 2 /







**అమరావతి, 19 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. దీపావళి ప్రాశస్త్యాన్ని తెలియచెబుతూ సీఎం చంద్రబాబు, రాష్ట్రం ప్రగతి పథంలో ప్రకాశించాలని ఆకాంక్షించారు. 'దీపం జ్యోతిః పరంబ్రహ్మ దీపం సర్వతమోపహమ్ ఎ దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీప నమోస్తుతే ఎఎ పరబ్రహ్మగా భావించే దీపాన్ని ఆరాధించే పవిత్ర దినం అయిన దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. లోకాన్ని పీడిస్తున్న నరకాసురుడు అనే రాక్షసుడిని శ్రీకృష్ణ, సత్యభామ కలిసి వధించిన రోజు ఇది. దీపావళి అంటేనే చీకట్లను పారద్రోలి వెలుగులు తీసుకువచ్చే పండుగ. ఈ దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో మరిన్ని వెలుగులు తీసుకురావాలని.. రాష్ట్రం ప్రగతితో ప్రకాశించాలని ఆకాంక్షిస్తున్నా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

## అఖిలేష్ వివాదాస్పద వ్యాఖ్యలు



**లక్నో: అక్టోబర్ 18 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** యావద్దేశం దీపావళి పండుగను సంబరంగా జరుపుకొనేందుకు సిద్ధమవుతున్న వేళ సమాజ్ వాదీ పార్టీ నేత, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి అఖిలేష్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీపోత్సవ్ సెలబ్రేషన్స్ కోసం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం చేస్తున్న ఖర్చును నిలదీశారు. దీపావళి పండుగను క్రిస్మస్ పండుగతో పోల్చి వాళ్ల నుంచి నేర్చుకోవాలని సలహా కూడా ఇచ్చారు. లక్నోలో జరిగిన మీడియా సమావేశంలో అఖిలేష్ మాట్లాడుతూ, క్రిస్మమ్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా నగరాల్లో ఎలా జరుపు కుంటారో చూసి ఇండియా నేర్చుకోవాలన్నారు. 'రాముడి పేరు మీద మీకు ఒక సలహా ఇవ్వాలనుకుంటున్నాను. క్రిస్మస్ పండుగకు ప్రపంచంలోని నగరాలన్నీ ప్రకాశవంతంగా ఉంటాయి. ఆ లైట్లు నెలల తరబడి ఉంటాయి. మనం కొవ్వొత్తులు, దీపాలపై వృథా ఖర్చు చేయడం ఎందుకు? ఈ ప్రభుత్వం నుంచి మనం ఏమి ఆశించగలం? ఈ ప్రభుత్వాన్ని తొలగించాలి. మరిన్ని అందమైన లైట్లు ఉండేలా చూసుకుంటాం' అని అన్నారు. అయోధ్య వెలిగిపోతుం

2లో

## ఏపీ కి 10 అక్షల కోట్ల పెట్టుబడులు

**అమరావతి, 19 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** :180 బిలియన్ డాలర్ల ఎకానమీగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 240 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడానికి కృషి చేయాలని ఆస్ట్రేలియాలోని తెలుగు వారికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం సిడ్నీలో ది ఆస్ట్రేలియా తెలుగు డయాస్పోరాలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనకు గూగుల్ ఎంత ముఖ్యమో ఎంఎస్ఎంఈ కూడా అంతే ముఖ్యమన్నారు. రూ.50 కోట్ల పెట్టుబడి పెట్టి.. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తే మీకు అండగా నిలుస్తానని ఈ సందర్భంగా వారికి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ రోజు ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్నానంటే ఆస్ట్రేలియా ప్రభుత్వమే అందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. టెక్నికల్ ఎడ్యూకేషన్‌లో మంచి పద్ధతులు, స్పోర్ట్స్, మైనింగ్ తదితర విషయాల్లో సహకరించుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే.. ఏ ఒక్కరి వల్ల కాదని.. అందరం కలిసి ఒక తాటిపైకి వచ్చి ఆ పని చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇటీవల పక్క రాష్ట్రాలతోనూ చిన్నచిన్న యుద్ధాలు జరుగుతున్నాయని.. ఆ క్రమంలో తనను ఎన్నో మాటలు అంటున్నారని తెలిపారు. అవేమీ తాను పట్టించుకోనని లోకేశ్ చెప్పుకొచ్చారు. రాష్ట్రాలు పోటీ పడితే ఇండియా గెలుస్తుందని తాను విశ్వసిస్తానన్నారు. అందరూ వచ్చి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములం కావాలని తాను కోరుతున్నానని తెలిపారు.గతేడాది దీపావళికి తాను యూఎస్ఏలో ఉంటే.. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్నానని గుర్తు చేసుకున్నారు. ప్రపంచం మొత్తంలో తెలుగువారు ఉండరని.. కానీ అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకూ మనదే డామినేషన్ అని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 'చంద్రబాబు నాయుడిని విజనరీ అంటాం.. ఇంకొకరిని ప్రిజనరీ అంటాం.. అర్థమయ్యిందా రాజా?' అంటూ లోకేశ్



చమత్కరించారు. అయితే 'గౌరవంగా గడిపేవాళ్లం.. మనకు ఈ రాజకీయాలు అవసరమా?' అని తన భార్య బ్రాహ్మణి.. తన తండ్రి చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేసినప్పుడు ప్రశ్నించిందని.. ఆ సమయంలో మీ స్పందన చూసి.. అందుకోసం మనం రాజకీయాల్లో ఉండాలని బ్రాహ్మణికి స్పష్టం చేశానని

2లో

## వ్యాపారులకు

### సీఎం చంద్రబాబు దివాళి గిఫ్ట్..




**అమరావతి, 19 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** దీపావళి పండగ సందర్భంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ వేస్తూ నిన్నే నిర్ణయం తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఇవాళ రాష్ట్రంలోని పారిశ్రామిక రంగానికి గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోని పరిశ్రమలకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను క్లియర్ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తొలి విడతగా రూ. 1,500 కోట్లను నిధులను విడుదల చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. చీకటిపై వెలుగు సాధించే విజయానికి ప్రతీకగా దీపావళి పండగను చేసుకుంటామని.. ఈ స్ఫూర్తితోనే పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోయినా.. పారిశ్రామిక రంగానికి అండగా నిలబడాలన్న నిబద్ధతతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వ్యాపారానికి అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. అంతేకాకుండా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన అన్నారు.

## పవన్ కల్యాణ్ దీపావళి సందేశం..



**అమరావతి, 19 క్రైమ్ కౌంటర్ న్యూస్ :** జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇవాళ (ఆదివారం) తెలుగు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'దీప కాంతులతో శోభాయమానంగా... సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే పండగ దీపావళి. తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు. మన భారతదేశంలో చేసుకునే ప్రతీ పండగకీ ఒక పరమార్థం ఉంది. మనకు జీవన శైలిని నేర్పుతుంది.చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని నిర్వహించుకుంటాం. దీపావళి స్ఫూర్తితో నయా నరకాసురులను ప్రజాస్వామ్య యుద్ధంలో ప్రజలందరూ కలసి ఓడించారు. ఈ నరకాసురులు మారీచుల్లాంటివారు. రూపాలు మార్చుకొంటూ- తమను ఓడించారనే అక్కసుతో.. ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, అశాంతి రేకెత్తించే కుట్రలకు దిగుతున్నారు.కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండి.. ఇలాంటి నయా నరకాసురులకు, వారి అనుచర గణానికి ఎప్పటికప్పుడు గుణపాఠం చెప్పాలి. ఆడపడుచులు సత్యభామ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి. ఈ వేడుకల్లో టపాసులు కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నా' అని పవన్ తన దీపావళి సందేశంలో పేర్కొన్నారు.

## బీసెంట్ రోడ్‌లో సీఎం



2లో

# ఏపీ కి 10 అక్షల కోట్ల పెట్టుబడులు

లోకేశ్ తెలిపారు.

గత ఎన్నికల్లో విదేశాల్లోని వారు సైతం కూటమి గెలుపు కోసం ఎంతో సహకరించారన్నారు. అందువల్లే 94 శాతం సీట్లు కూటమి గెలిచిందని చెప్పారు. ఆ ఎన్నికల్లో ఇంత వేవ్ రావడం వెనుక ఇక్కడి ప్రతి వ్యక్తి కష్టం ఉందని తెలిపారు. తనతో సహా 50 మంది కొత్త ఎమ్మెల్యేలు.. ఈ సారి అసెంబ్లీలోకి అడుగుపెట్టారని పేర్కొన్నారు. గత 16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టబడులు ఆంధ్రప్రదేశ్‌కి వచ్చాయని వివరించారు. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణే తమ లక్ష్యమని ఆనాడే చెప్పామన్నారు. ఉత్తరాంధ్ర ఫార్మాహబ్‌గా, స్టీల్ సిటీగా ఇప్పుడు డేటా హబ్ కూడా రూపాంతరం చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఏపీకి గూగుల్ వచ్చిందంటే అందుకు కేంద్రం సహకారం సైతం ఉందన్నారు. ఈ సంస్థ ఏర్పాటుకు కొన్ని చట్టాలు అడ్డు వస్తున్నాయని ప్రధాని దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకు వెళ్లారన్నారు. ఈ విషయాన్ని వెంటనే ఆర్థిక మంత్రికి చెప్పి అందుకు సంబంధించిన చట్టాలను సైతం ప్రధాని మోదీ సవరణ చేయించారని వివరించారు. ఒక క్లారిటీతోనే తామంతా కలిసికట్టుగా ముందుకు వెళుతున్నామన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి క్లారిటీతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. పొత్తు అన్న తర్వాత చిన్నచిన్న సమస్యలుంటాయని .. ఒకే కుటుంబంలోనూ సమస్యలు ఉంటాయని ఈ సందర్భంగా లోకేశ్ చమత్కరించారు. ఏపీలో రానున్న 15 సంవత్సరాలు కలికట్టుగా ముందుకు వెళ్లాలని పవన్ కల్యాణ్ చెపుతున్నారని తెలిపారు. అయితే అన్ని విషయాల్లోనూ తాము అంగీకరిస్తామని చెప్పడం లేదని.. ఎజెండా ఒక్కటే ఏపీ నెంబర్ వన్ కావాలని ఆకాంక్షిస్తున్నట్లు నారా లోకేశ్ తెలిపారు.

గత అయిదేళ్లు తలదించుకుని బతికే పరిస్థితిని తెచ్చారంటూ వైసీపీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు మీ కంపెనీలో బ్రాండ్ అంబాసిడర్లు కావాలి... ఏపీ గురించి మాట్లాడండంటూ ఆస్ట్రేలియాలోని తెలుగు వారికి మంత్రి లోకేశ్ సూచించారు. ఒక కంపెనీ ఇండియాలో పెట్టుబడులు పెట్టాలంటే వెంటనే తమకు తెలియజేయాలని ఆ డీల్ క్లోజ్ చేసే బాధ్యత తాము తీసుకుంటామని వారికి మంత్రి నారా లోకేశ్ క్లియర్ కట్‌గా స్పష్టం చేశారు.

# బీసెంట్ రోడ్‌లో సీఎం

విజయవాడ, అక్టోబర్ 19: విజయవాడ బీసెంట్ రోడ్డులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇవాళ(ఆదివారం) సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా చిరు, వీధి వ్యాపారులతో సరదాగా ముచ్చటించారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. జీఎస్టీ సంస్కరణల అనంతరం వారికి కలుగుతున్న ప్రయోజనాల గురించి ఆరా తీశారు. జీఎస్టీ తగ్గింపుతో తగ్గిన ధరల మేరకే వస్తువులను ప్రజలకు విక్రయిస్తున్నారా? అని సీఎం అడిగి తెలుసుకున్నారు.పన్ను తగ్గింపుతో దసరా- దీపావళి పండుగలకు విక్రయాలు ఏ మేరకు పెరిగాయని కూడా సీఎం చంద్రబాబు వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. బీసెంట్ రోడ్డులో దీపావళి ప్రమిదలు విక్రయిస్తున్న మహిళతో మాట్లాడిన సీఎం.. వారి సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు.

# అఖిలేష్ వివాదాస్పద వ్యాఖ్యలు

డటం చూడలేకే..

దీపాలకు పెట్టే ఖర్చు వృథా అని, క్రిస్మస్‌ను చూసి నేర్చుకోవాలని అఖిలేష్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. సమాజ్‌వాదీ పార్టీ పాలనలో అయోధ్య చీకట్లలో మగ్గేదని, అయోధ్యలో రామభక్తులపై ఎస్‌పీ ప్రభుత్వం కాల్పులు కూడా జరిపిందని ఆ పార్టీ ప్రతినిధి షెహబాజ్ పూనావాలా ఎద్దేవా చేశారు. అయోధ్య వెలిగిపోతుంటే అఖిలేష్ యాదవ్‌కు కడుపు మండిపోతుంటుందని, ఇదే వ్యక్తులు సైఫైలో గానాబజానాలు నిర్వహిస్తుంటారని, అదే అయోధ్యలో దీపావళి జరుపుకుంటే ఆయనకు సమస్య వచ్చిపడుతుందని అన్నారు. అయోధ్యకు రాముడు తిరిగి వచ్చినప్పుడు విజయానికి చిహ్నంగా దీపాలు వెలిగిస్తుంటారని, చీకటిని పారద్రోలే రోజుగా లక్షలాది మంది రామభక్తుల విశ్వాసానికి దీపావళి ప్రతీకని బీజేపీ నేత గౌరవ్ భాటియా అన్నారు.మండిపడిన వీహెచ్‌పీ

విదేశీ సంస్కృతిని అఖిలేష్ ప్రోత్సహిస్తున్నారంటూ విశ్వహిందూ పరిషత్ మండిపడింది. హిందువుల కంటే క్రైస్తవులనే ఆయన ఎక్కువగా ఇష్టపడుతున్నారని, జీహాదీలు, మతమార్పిడి ముఠాలకు ఆయన దూత అని వీహెచ్‌పీ ప్రతినిధి వినోద్ బన్సాల్ ఆక్షేపించారు. దీపావళి రోజున క్రిస్మస్ లెక్చర్లు ఇవ్వడం ఏమిటి? క్రిస్మస్ మరో రెండు నెలల్లో వస్తుంది. అసలు ఇప్పుడు ఏ పండుగ జరుగుతోందో కూడా ఆయనకు తెలిసినట్టు లేదు. సనాతన వ్యతిరేక భావజాలాన్ని ఆయన ఎప్పుడు వదిలించుకుంటారు? అని ప్రశ్నించారు.

# అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారికి అడుగడుగునా గుంతలే



**క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి పులిమెల మాణిక్యం.**పల్నాడు జిల్లా దుర్గి మండల పరిధిలోని అడిగోప్పల గ్రామ శివారులో ప్రత్యక్ష దైవంగా కొలువుదీరిన శ్రీ లక్ష్మీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారికి అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆలయానికి వెళ్లే పరిధిలోని రహదారి బాగా దెబ్బతిన్నాయని ఆలయానికి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనిపై అధికారులు స్పందించి రహదారిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# టిడిపి కి షాక్... వైసీపీలోకి చేరికలు



**అద్దంకి:క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** పట్టణంలో టిడిపికి షాక్ తగిలింది. స్వయాన మంత్రి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఇలాక లో టిడిపి అధికారంలో ఉన్నప్పటికీ ఆ పార్టీ నుంచి 13వ వార్డుకు చెందిన 50 టిడిపి కుటుంబాలు వైయస్సార్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వైసీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి వైసిపి కండువా కప్పారు. కొత్త, పాత కలయికతో ప్రతి ఒక్కరూ వైసిపి పార్టీ గెలుపుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఎవరైతే ఇప్పటినుంచే కష్ట కాలంలో పార్టీకి తోడుగా ఉంటారు అధికారంలోకి వచ్చాక వారికి మాత్రమే సముచిత స్థానం ఉంటుందని డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ తెలియజేశారు. ఇప్పటికే ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి గెలుపు ఖాయమని ఆయన తెలిపారు. అందరం సమిష్టిగా పనిచేసి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు.

# ఈ దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి కోడెల శివరాం



**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పల్నాడు జిల్లా :** బితెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ ఈ దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని డాక్టర్ కోడెల శివరామ్ రాష్ట్ర ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, నాయకులకు, కార్యకర్తలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అమావాస్యనాటి కారు చీకటిని తొలగించడానికి, దీపాలతో వెలుగును నింపడం ఈ పండుగ సంప్రదాయమని, మనలోని అంధకారాన్ని తొలగించి జ్ఞాన జ్యోతులు వెలిగించాలన్నది దీనివెనుక ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరి జీవితాల్లో సుఖః సంతోషాలు వెల్లివిరియాలని, ఆ లక్ష్మీదేవి చల్లని చూపుతో అష్ట ఐశ్వర్యాలు సిద్ధించాలని కోరారు. దీపావళి అనేది చీకటి పై వెలుగు, అజ్ఞానం పై జ్ఞానం, చెడు పై మంచి విజయం సాధించిన పండుగ. ఈ పవిత్ర పండుగ సందర్భంగా ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం, శాంతి, సౌభాగ్యం నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని జూనియర్ కోడెలా తెలిపారు ప్రజలు దీపావళి పండుగను ఆనందంగా, పర్యావరణహితంగా జరుపుకోవాలని, ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

**- ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్ష**

**- చీకట్లను తరిమేసే పండుగ దీపావళి**

**- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**పర్చూరు: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్** రాష్ట్ర ప్రజలందరికీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు ప్రజల జీవితాల్లో కష్టాల చీకట్లు తొలగిపోయి సంతోషాల వెలుగులు ప్రసరించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తున్నారని,ఈ దీపావళి విజయానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. టపాసుల వెలుగులతో, దీప కాంతుల జ్యోతులతో, సిరిసంపద రాసులతో ఈ దీపావళి ప్రతి ఇంట సిరుల పంట కురిపించాలని కోరుకుంటున్నాను. కారు చీకట్లను దీపాల కాంతులు తరిమేసినట్లుగా ప్రజల కష్టాలను తరిమేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను," అని తెలిపారు. ప్రజల చీకట్లను చెరిపేసే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, ఒక్కొక్క దీపం వెలిగిస్తూ చీకట్లను పారద్రోలినట్లుగా ఒక్కొక్క మార్పు సాధించుకుంటూ బంగారు భవిష్యత్‌ను నిర్మించుకుందామని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు.అష్టలక్ష్ములు ప్రతి ఇంట్లో నెలవై సకల శుభాలను, ధైర్యాన్ని, స్థైర్యాన్ని, విజయాలను, సిరి సంపదలను, సుఖ సంతోషాలను ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ,తెలుగింటి లోగిళ్లన్నీ దీప కాంతులతో వెలుగులీనాలని, ఈ దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు.

# 24న ఎమ్మెల్యే జూలకంటి తనయుడి వివాహం



**క్రైం కౌంటర్ కారంపూడి ప్రతినిధి దివాకర్** మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పెద్ద కుమారుడు టీడీపీ యువ నాయకుడు జూలకంటి గౌతమ్ రెడ్డి వివాహం ఈనెల 24వ తేదీన గుంటూరు లోని మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ లో ఉన్న శ్రీ కన్వెన్షన్ లో అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ వివాహానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మరియు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు. అనంతరం 27వ తేదీన స్వగ్రామమైన వెల్దుర్తి కళ్యాణ మండపంలో రిసెప్షన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇందుకు భారీ ఏర్పాట్లకు సిద్ధం చేస్తున్నారు రాష్ట్ర నలుమూలల నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొననున్నారు

# ఐబీఎం క్వాంటమ్ ఫెస్ట్‌కు సన్నద్ధం-ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్



## రేపటి నుంచి ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో నిర్వహణ

## - ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఎచ్చెర్ల, అక్టోబరు 19 ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఐబీఎం క్వాంటమ్ క్విస్కిట్ పాల్ ఫెస్ట్-2025 మంగళవారం ప్రారంభంకానుంది. ఈ నెల 27వరకు ఈ ఫెస్ట్ జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు కాటం నిఖిల్ తేజ, కాసిం వాలి దూదేకుల, ప్రవీణ్‌కుమార్ చెరుకూరి, జాన్‌బాబు చదువుల, గుణశ్రీ కిమిడి ఇచ్చిన ప్రజెంటేషన్‌ను అభినందించి ఐబీఎం క్వాంటమ్ ఈ ఫెస్ట్ నిర్వహణకు ఎంపిక చేసింది. ప్రపంచ వ్యాప్తంగా చాలా విద్యా సంస్థలు ఈ ఫెస్ట్ నిర్వహణ కోసం పోటీపడ్డాయి. ఇందులో కేవలం 55 విశ్వ విద్యాలయాలు మాత్రమే ఎంపికయ్యాయి. రాష్ట్రం నుంచి ఏకైక సంస్థగా ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ ఎంపిక కావడం విశేషం. ఈ ఫెస్ట్ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్‌కే వ్యాలీ (ఇడుపులపాయ)లోని నాలుగు క్యాంపస్‌ల్లో జరగనుంది. ఐబీఎం క్వాంటమ్ ఇండియన్ లీడ్ ఎల్.వెంకట సుబ్రమణ్యం హాజరవుతారు. రెండు రోజుల పాటు హ్యాక?థాన్ నిర్వహిస్తారు. విద్యార్థులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ ద్వారా పాల్గొంటారు. ఈ రంగంలోని ఉపాధి అవకాశాలపై వర్క్‌షాపులు, నిపుణుల ఉపన్యాసాలు, క్వాంటం సాంకేతికాభివృద్ధిపై చర్చ ఉ ంటుంది. క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ ఆధ్వర్యంలో ఏవో డాక్టర్ ముని రామకృష్ణ తదితరులు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఫెస్ట్‌కు కన్వీనర్‌గా అకడమిక్స్ డీన్ డాక్టర్ శివరామకృష్ణ వ్యవహరిస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం..

క్వాంటం ఫెస్ట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నాం. ఈ నెల 21 నుంచి 27వరకు ఈ ఫెస్ట్ జరగనుంది. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఫెస్ట్‌తో విద్యార్థులు మరింత సృజనాత్మకంగా, సాంకేతికంగా ఆలోచించే అవకాశం ఉ ంది.

# పేలుతున్న టపాసుల ధరలు

**గత ఏడాదితోపోలిస్తే 10-20 శాతం అధికం**

**వర్షంతో సాయంత్రం వరకు మందకొడిగా కొనుగోళ్లు**

**రాత్రి తరువాత ఊపందుకున్న అమ్మకాలు**



అనకాపల్లి టౌన్, అక్టోబరు 19 దీపావళి పండగ సందర్భంగా జిల్లాలో బాణసంచా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా శాఖల అధికారుల అనుమతుల మేరకు అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, పాయకరావుపేట పట్టణాలతోపాటు అన్ని మండల కేంద్రాల్లో నివాసాలకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలుచోట్ల దఫదఫాలుగా వర్షం పడడం, సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతంగా వుండడంతో అమ్మకాలు మందకొడిగా సాగాయి. రాత్రి ఏడు గంటల నుంచి దుకాణాల వద్ద క్రమేపీ రద్దు పెరిగి, బాణసంచా విక్రయాలు ఊపందుకున్నాయి. ఎప్పటి మాదిరిగానే ధరలు మండిపోతున్నాయని, గత ఏడాదితో పోలిస్తే పది నుంచి 20 శాతం వరకు పెరిగాయని అంటున్నారు. గత ఏడాది కాకర పువ్వొత్తులు (రంగులు) పది ప్యాకెట్లు రూ.300లకు లభించగా ఈసారి బ్రాండ్‌నుబట్టి రూ.350 నుంచి రూ.400లకు అమ్ముతున్నారు. సాధారణ కాకర పువ్వొత్తులు రూ.150 నుంచి రూ.200కి, భూచక్రాల బాక్స్ రూ.150 నుంచి రూ.200లకు పెరిగాయి. ప్రస్తుతం రూ. 200లకు అమ్ముతున్నారని చెబుతున్నారు. సోమవారం వర్షం లేకపోతే అమ్మకాలు బాగుంటాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వ్యాపారులకు దీపావళి ధమాకా!

**గత ఏడాదితో పోలిస్తే పెరిగిన అమ్మకాలు**

**వర్షాలు లేకపోవడంతో ఫుల్ జోష్**

**ధరలు పెరిగినా కనిపించని ప్రభావం**



దీపావళి నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బాణసంచా విక్ర యాలు జోరుగా సాగుతున్నాయి. నగర పరిధిలోని ఏయూ, ఆల్వార్‌దాస్ మైదానాలతోపాటు మధురవాడ, ఎన్ఏడీ, గాజువాక ప్రాంతాల్లో ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు.

జిల్లాలో మొత్తం 530 మందికి అధికారులు బాణసంచా విక్రయాలకు లైసెన్సులు మంజూరుచేశారు. కొన్నిచోట్ల వీ?ధుల్లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. గత ఏడాదితో పోలిస్తే 20 నుంచి 30 శాతం అమ్మకాలు పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది దీపావళికి ముం దు వర్షాలు కురవడంతో అమ్మకాలపై ప్రభావం పడింది. ఈ ఏడాది వర్షం లేకపోవడం వ్యాపారులకు కలిసి వచ్చింది. సోమవారం కూడా వర్షం లేకపోతే స్టాక్ క్లియర్ చేసేస్తామని చెబుతున్నారు. ఇక ధరలు ఐదు నుంచి పది శాతం పెరిగాయి. అయితే అమ్మకాలపై పెద్దగా ప్రభావం పడలేదంటున్నారు.

ప్రత్యేక ఆఫర్లునగర పరిధిలో బాణసంచా విక్రయిస్తున్న వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. 40, 50, 60 శాతం తగ్గింపు అంటూ ఆకట్టుకునే ప్రయ త్నం చేస్తున్నారు. ఇదే అదనుగా గత ఏడాది నిల్వలను క్లియర్ చేసుకుంటున్నారు. దీంతో వినియోగదారులు ఎగబడుతున్నారు.

నేడు కీలకం..ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ఆదివారం అమ్మ కాలు భారీగానే సాగాయి. ఇక దీపావళి సందర్భంగా సోమవారంపై వ్యాపారులు భారీ ఆశలు పెట్టుకున్నారు. శని, ఆదివారాల్లో 40 నుంచి 50 శాతం అమ్మకాలు సాగాయి. వర్షం లేకపోతే మంచి వ్యాపారం జరుగుతుందని భావిస్తున్నారు. ఫ్యామిలీ ప్యాక్, స్పెషల్ ప్యాక్‌లను ఎక్కువమంది కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ప్యాక్‌లో 20 నుంచి 50 వరకు ఐటెమ్స్ ఉంటున్నాయి. స్పెషల్ బాక్సు ధర రూ.800 నుంచి రూ.5 వేలు వరకు ఉన్నాయి.

అమ్మకాలు బాగున్నాయిమూడేళ్లతో పోలిస్తే అమ్మకాలు పెరిగాయి. సోమవారం కూడా వర్షం పడకపోతే 100 శాతం అమ్మకాలు సాగే వీలుంది. ధరలు అందుబాటులో ఉండడంతో ప్రజలు భారీగా వస్తున్నారు. ఆదివారం జిల్లాలో పెద్దఎత్తున విక్రయాలు సాగాయి. చోడవరం, తుని, తణుకు, విజయనగరం నుంచి సరకు తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. రెండు, మూడేళ్లతో పోలిస్తే భారీ సంఖ్యలో కొనుగోలు దారులు వచ్చారు. ప్రతి షాపు కిక్కిరిసిపోయింది. గత ఏడాది రూ.3 వేలు సామగ్రి కొన్నాం. ఈ ఏడాది రూ.2500కే ఎక్కువ వచ్చాయి. ధరలు భారీగా పెరిగినట్టు అనిపించలేదు. అవసరమైన మేరకు తీసుకున్నాం.

నగరంలో ఎలాంటి అనుమతులు లేకుండానే బాణసంచా విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏటా దీపావళికి నాలుగైదు రోజులు ముందుగానే బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అనుమతులు జారీచేస్తుంటారు. ఈ ఏడాది పండగ ముందురోజు వరకు అనుమతులు జారీచేయకపోవడం చర్చనీయాంశంగా మారింది.

# పండుగ వేళ ఉలికిపాటు! లగేజ్ కిందకు దించే క్రమంలో ఘటన


**పార్సిల్ కార్యాలయం షెడ్ పైభాగం, కిటికీ అద్దాలు ధ్వంసం**

**భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు**

**అధికారుల పర్యవేక్షణ లోపంపై విమర్శల వెల్లువ**

బెలగాం, అక్టోబరు19 పార్వతీపురం పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎన్నడూ లేని విధంగా భారీ పేలుడు సంభవించింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గుర య్యారు. వాస్తవంగా మందుగుండు సామగ్రిని బస్సులు, రైళ్లలో పార్సిల్ సర్వీస్ ద్వారా పంపిం చకూడదు. వాటి వల్ల సంభవించే ప్రమాదం చాలా తీవ్రంగా ఉంటుంది. అయితే ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చోటుచేసుకున్న పేలుడు ఘటనతో ప్రయాణికులు, స్థాని కులు షాక్‌కు గురయ్యారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షతగాత్రుల కుటుంబాల్లో మాత్రం పండుగ సందడి లేకుండా పోయింది. వివరాల్లోకి వెళ్తే..

పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి ఆదివారం ఉదయం విజయనగరం నుంచి ఓ బస్సు వచ్చింది. దానికి సమీపంలోనే ఉన్న ఆర్టీసీ పార్సిల్ కార్యాలయం నుంచి ఓ కళాసి వచ్చి.. ఆ బస్సులో సామాన్లు దించేందుకు వెళ్లాడు. మందుగుండు సామగ్రి అని తెలియక లగేజ్ బాక్స్‌ను పార్సిల్ కౌంటర్ వద్దకు తీసుకొచ్చి కిందకు దించగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి పార్సిల్ కౌంటర్ షెడ్ పైభాగం, అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో కళాసి రెడ్డి రమేష్, బస్సు డ్రైవర్ తెర్లి రవి, తోపుడు బండి కార్మికుడు సుందరరావు, మరో వ్యక్తి కె.రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. రవి, ఆర్.రమేష్‌ను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు, కె.రమేష్‌ను విజయనగరం మహా రాజా ఆసుపత్రికి తరలించారు. అయితే కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ డ్రైవర్ రవి మృతి చెందారు. ఆయనది నర్సిపురం గ్రామంగా తెలిసింది. కాగా విజయనగరంలోని పార్సిల్ బుక్ చేసిన వారి ఫోన్ నెంబర్, పార్వతీపురంలోని పార్సిల్ తీసుకునే వారి ఫోన్ నెంబర్ ఒకటే ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్సిల్ పంపిన వ్యక్తి జియ్యమ్మవలస నిమ్మలపాడు గ్రామానికి చెందిన కిషోర్ కుమార్



అని తెలుస్తోంది. 25 కేజీల జనరల్ ఐటమ్ పేరుతో పార్సిల్ బుక్ అయినట్లుగా రశీదు ఉన్నట్లు ఆర్టీసీ కొరియర్ సర్వీసు అధికారులు చెబుతున్నారు. ఎస్పీ మాధవరెడ్డి తన సిబ్బందితో అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మరోవైపు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాణసంచాను పార్సిల్ ద్వారా పంపించ కూడదన్నారు. ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయనతోపాటు ఎస్పీ జిల్లా కేంద్రాసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. అక్కడ వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందజేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు కూడా ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. సంబంధిత వైద్యులను అప్రమత్తం చేశారు.

మంత్రుల ఆరా పార్వతీపురం, అక్టోబరు 19: జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనపై మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, అనిత, కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. సంఘటన ఏ విధంగా జరిగింది. దానికి గల కారణాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# కార్తీకంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు



అన్నవరం, అక్టోబరు 19 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి కార్తీకమాసం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందు లు రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పా టు చేసి మాట్లాడారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు రాకు ండా ఎక్కిడికక్కడ వన్‌వే మాదిరి వాహన రాకపోకలు కొనసాగుతాయన్నారు. రద్దీరోజుల్లో ప శ్చిమ రాజగోపురం వద్ద హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి లోపల వ్రతమండపాలు ఖాళీఅయిన తరువాతనే కంపార్టమెంట్‌లలో వేచిఉన్న వారిని లోపలకి పంపుతామని దీని వల్ల తోపులాటలకు ఆస్కారం లేకుండా ఉంటుందని ఈ వో తెలిపారు. కార్తీకమాసంలో సత్యదేవుడి గిరిప్రదక్షిణ, తెప్పోత్సవం తదితర ముఖ్యమైన కార్యక్రమాలను అనుకున్న సమయానికి ప్రారంభిస్తామన్నారు. కార్తీకపౌర్ణమి రోజున (నవంబ రు 5) గిరిప్రదక్షిణ జరగనుందన్నా రు. ఉ దయం 8.30కి సత్యదేవుడి పల్లకీలో రత్న,సత్యగిరిలు చుట్టూ ప్రదక్షిణ ఉ ంటుందని.. భక్తులతో మధ్యాహ్నం రెండుగంటల నుంచి సత్యరథం ప్రారంభమవుతుందని సుమారు 1.50 లక్షల మ ంది భక్తులు విచ్చేస్తారని అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. స్వామివారి తెప్పోత్సవం నవంబరు 2న జరుగుతుందని, ఆ రోజు సాయంత్రం 5.30కి తులసిధాత్రి పూజను నిర్వహించి రాత్రి 7గంటలకు పంపాసరోవరంలో నౌకావిహారం నిర్వహిస్తామన్నారు. వేడుకలకు సంబంధించి విస్తృతప్రచారం గావించినట్టు ఈవో తెలిపారు. సమావేశంలో ఏఈవోలు కృష్ణారావు, అనకాపల్లి ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

# మూడు కిలోమీటర్లు నడిచి.. కొండలెక్కి..

సాలూరు రూరల్, అక్టోబరు 19 జిల్లాలో పర్యాటకాభివృద్ధికి కంకణం కట్టుకున్న కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం లొద్ద జలపాతానికి వెళ్లారు. అయితే ఇందుకోసం బాగా శ్రమించారు. మూడు కిలోమీటర్లు పైబడి నడిచి కొండలెక్కి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. భారీ వర్షంలో తడుస్తూ జలపాతాన్ని పరిశీలించారు. వాస్తవంగా ఏవోబీ పరిధి సాలూరు మండలం కొదమ పంచాయతీలో లొద్ద బారిబంద జలపాతం ఉంది. సుందరంగా ఉండే ఈ జలపాతానికి చేరుకోవడానికి రోడ్డు నిర్మాణం జరుగుతుంది. కాగా జలపాతం సందర్శించేందుకు పార్వతీపురం నుంచి కారులో మక్కువ మండలం నంద వరకు వెళ్లారు. అక్కడ నుంచి అధికారులతో కలిసి జీపుల్లో లొద్దకు పయనమయ్యారు. వర్షాలకు ఆ మట్టి రోడ్డు పాడవ్వడంతో జీపులను మాసిన వలస దాటిన తర్వాత నిలిపివేశారు. అక్కడి నుంచి కొద్ది దూరం బైక్‌పై కలెక్టర్ పయనమవగా.. అధికారులంతా కాలినడకన వెళ్తుండడంతో ఆయన కూడా నడకబాట పట్టారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్లు నడిచి లొద్ద వద్దకు చేరుకున్నారు. అక్కడ గిరిజనులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేని ఆరా తీశారు. ఏయే పంటలు పండిస్తున్నారు? ఏ ఆహారం తింటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరుకు హామీ ఇచ్చారు. బందపాయి, చింతామలకు రోడ్డు నిర్మించి, అంబులెన్స్ అందు బాటులో ఉండేటట్టు ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరారు. లొద్ద పర్యటనకు వెళ్లిన జిల్లా కలెక్టర్ స్థానిక గిరిజనులు అందించిన రాగి సంకటి, అంబలి, టమాటా చట్నీ తిన్నారు. అనంతరం కలెక్టర్ మరో రెండు కిలోమీటర్లు వరకు నడిచి లొద్ద జలపాతానికి చేరుకున్నారు. అనంతరం జలపాతంలో ఆయన స్నానం చేశారు. ఆ తర్వాత కలెక్టర్ లొద్ద



చేరుకుని అధికారులతో సమీక్షించారు. లొద్ద జలపాతం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. లొద్ద జలపాతానికి వెళ్లే మార్గాన్ని స్థానికుల సాయంతో బాగు చేయాలని పీఆర్ డీఈని ఆదేశించారు. చింతచెట్టు, కాగితపు పూల మొక్కలు నాటాలని, జలపాతానికి వెళ్లడానికి సూచిక బోర్డులు పెట్టాలని ఉ పాధి ఏపీవో టి.రామకృష్ణకు సూచించారు. గిరిజనులకు రుణాలందించి జలపాతం సమీపంలో దుకాణాలు, చిన్న హోటల్స్ ఏర్పాటు చేయించాలని వెలుగు ఏపీఎం ఎ.జయమ్మను ఆదేశించారు. రోడ్ల అనుమతులు తదితర అంశాలపై డీఎఫ్‌వో ప్రసూనతో మాట్లాడారు. పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేస్తే స్థానిక గిరిజనులకు ఉపాధి లభిస్తుందన్నారు. సాయంత్రం వర్షం తగ్గిన తర్వాత లొద్ద జీపుల వద్దకు చేరుకొని తిరుగు పయనమయ్యారు.



# ఆదిత్యుని ఆదాయం రూ.3.50 లక్షలు

అరసవల్లి, అక్టోబరు 19: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి ఆదివారం రూ.3,50,721 ఆదాయం లభిం చింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.79, 500, విరాళాలు రూ.1,23,446, ప్రసాదాల ద్వారా రూ.1,38,275 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి అనివెట్టి మండపంలో ఆదివారం శివ పంచాయతన సహిత మహా లింగార్చన నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ లింగార్చన చేశారు. కార్యక్రమంలో పండితులు దర్భ ముళ్ల శ్రీనివాస శర్మ, ఆర్.వికాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు వెండి బిందెలు అందజేత..

# సినిమా



## పవన్ కల్యాణ్ అంటే పిచ్చి.. కానీ ఇప్పుడు ఆయన సినిమాలో యాక్ట్ చేయను:

ఈ దీపావళికి నాలుగు సినిమాలు రిలీజయ్యాయి. మిత్రమండలి, తెలుసు కదా, డ్యూడ్, కె-ర్యాంప్ ఒకటి, రెండు రోజుల వ్యవధిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. వీటిలో కె-ర్యాంప్ సినిమా పై ఆడియెన్స్ ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపిస్తున్నారని తెలుస్తోంది. డబుల్ మీనింగ్ డైలాగులు ఎక్కువగా ఉన్నాయని విమర్శలు వచ్చినా కిరణ్ అబ్బవరం సినిమా హాయిగా నవ్వుకునేలా ఉందని కాంప్లిమెంట్స్ వినిపిస్తున్నాయి. జైన్స్ నాని తెరకెక్కించిన ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్ గా నటించింది. నరేశ్ మరో కీలక పాత్రలో మెరిశాడు. గత దీపావళికి క సినిమాతో బ్లాక్ బస్టర్ కొట్టిన కిరణ్ అబ్బవరం ఈసారి కె-ర్యాంప్ తో మరో హిట్ అందుకున్నాడు. ప్రస్తుతం ఈ సినిమాకు హిట్ టాక్ రావడంతో మరింతగా ప్రమోట్ చేసే పనిలో ఉన్నాడు కిరణ్. వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నాడు. ఇదిలా ఉంటే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశాడు కిరణ్.'మీకు పవన్ కళ్యాణ్ అంటే ఇష్టం కదా. ఆయన సినిమాల్లో నటించే అవకాశం వస్తే చేస్తారా'అని యాంకర్ అడిగిన ప్రశ్నకు ఇలా ఆన్సరిచ్చాడు కిరణ్ అబ్బవరం. 'నాకు పవన్ కళ్యాణ్ అంటే చాలా ఇష్టం. ఈ విషయం ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. కానీ, ఆయన సినిమాల్లో ఇప్పుడు నేను చేయలేను. ఎందుకంటే, ఇప్పుడు నేను హీరోగా నా కెరీర్ బిల్డ్ చేసుకునే ప్రాసెస్ లో ఉన్నాను. కాబట్టి, ఈ టైంలో మళ్లీ సైడ్ క్యారెక్టర్స్ అంటే చేయలేను. ఒకవేళ అవకాశం వస్తే కూడా.. ఈ క్యారెక్టర్ కిరణ్ అబ్బవరం అయితేనే చేయగలడు అనేలా ఉంటే చేస్తా. కానీ, పవన్ కల్యాణ్ సినిమాలో కనిపించాలని మాత్రం చేయను. ఇప్పుడు అంతా నా ఫోకస్ సినిమాలు, నా మార్కెట్ మీదనే ఉంది' అని కిరణ్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ హీరో కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. చాలా మంది కిరణ్ ఓపెన్ గా మాట్లాడడని ప్రశంసలు కురిపిస్తున్నారు.





## మీకు బీపీ లేదా షుగర్ ఉందా..? అయితే దీపావళి రోజు కచ్చితంగా ఈ జాగ్రత్తలు తీసుకోండి!

దీపావళి సందర్భంగా టపాసుల మోత మోగిపోతూ ఉంటుంది. దాంతో పాటు పండగ ఆనందంలో చాలా మంది స్వీట్లు ఎక్కువగా తింటారు. ఇదే సమయంలో మధుమేహం, బీపీ రోగుల ఆరోగ్యం తీపి పదార్థాలు, వేయించిన ఆహారాలు, మారుతున్న దినచర్యల కారణంగా ప్రభావితమవుతుంది. ఈ సమయంలో ప్రజలు తమ ఆహారాన్ని నియంత్రించుకోవడం మర్చిపోతారు, ఇది రక్తంలో చక్కెర, రక్తపోటు స్థాయిలను మరింత దిగజార్చుతుంది. ఆలస్యంగా మేల్కొని ఉండటం, ఒత్తిడి, కాలుష్యం కూడా పరిస్థితిని మరింత దిగజార్చుతాయి. అందువల్ల సరైన ఆహారం, క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం, తగినంత నిద్ర చాలా అవసరం.పండుగ సమయంలో చెడు ఆహారపు అలవాట్లు, అధిక స్వీట్లు, ఉప్పు తీసుకోవడం మధుమేహం, రక్తపోటు రోగులకు ప్రమాదకరం. ఇది రక్తంలో చక్కెర పెరుగుదల, రక్తపోటులో ఆకస్మిక పెరుగుదల లేదా తగ్గుదల, గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. నూనె ఆహారాలు, చక్కెర పానీయాలు కూడా వాపు, అలసటను పెంచుతాయి. ఇంకా నిద్ర లేకపోవడం, మానసిక ఒత్తిడి పరిస్థితిని మరింత దిగజార్చుతాయి. దీపావళి రద్దీ సమయంలో మందులు లేకపోవడం వల్ల గ్లూకోజ్ లేదా రక్తపోటు అసమతుల్యత ఏర్పడుతుంది, ఇది ఆసుపత్రిలో చేరడానికి కూడా దారితీస్తుంది.

దయాబెటిస్, బిపి రోగులు ఈ విషయాలను గుర్తుంచుకోవాలి

ఢిల్లీలోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌లో ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ అలీ షేర్, దీపావళి వంటి పండుగల సమయంలో షుగర్, బీపీ ఉన్న వాళ్లు ఇంట్లో తయారుచేసిన చక్కెర లేని స్వీట్లు లేదా ఎండిన పండ్లను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. అలాగే ఆలస్యంగా మేల్కొని ఉండటం, ఒత్తిడికి గురికావడం లేదా అతిగా అలసిపోవడం మానుకోండి, ఎందుకంటే ఇవి గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తాయి. పండుగ సమయంలో మీ మందులు తీసుకోవడం, హైడ్రేటెడ్‌గా ఉండటానికి పుష్కలంగా నీరు తాగడం గుర్తుంచుకోండి. రోజూ ఒక చిన్న నడక, తేలికపాటి యోగా లేదా ధ్యానం శరీరాన్ని చురుకుగా, మనస్సును ప్రశాంతంగా ఉంచుతుందని డాక్టర్ సూచిస్తున్నారు. మంచి ఆరోగ్యం, ఆనందాన్ని నిర్ధారించడం ద్వారా పండుగను మితంగా, సమతుల్యతతో ఆస్వాదించడం చాలా ముఖ్యం.



# యమ డేంజర్..

## వీళ్లు సీతాఫలం అస్సలు తినకూడదు..!

సీతాఫలం ఆరోగ్యానికి చాలా మంచిది. విటమిన్లు, లవణాలు అధికంగా ఉండి, కొవ్వు ఏ మాత్రం ఉండదు. శీతాకాలం మొదలైతే అందరూ సీతాఫలం గురించే ఆలోచిస్తారు. ఈ సీజన్‌లో లభించే సీతాఫలం తినడానికి అందరూ ఇష్టపడతారు. కానీ, కొందరు మాత్రం సీతాఫలం అస్సలు తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎవరు సీతాఫలం తినకూడదు..? ఎందుకు అనే దాని గురించి ఇక్కడ తెలుసుకుందాం..ప్రస్తుతం చాలా మంది మధుమేహంతో బాధపడుతున్నారు. ఈ మధుమేహ వ్యాధితో బాధపడుతున్న వారిలో ఎక్కువ మంది భారతదేశంలోనే ఉన్నారని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే భారతదేశాన్ని మధుమేహ రాజధాని అని కూడా పిలుస్తున్నారు. నేడు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అన్ని వయసుల వారికి డయాబెటిస్ పెద్ద సమస్యగా మారింది. మారుతున్న జీవనశైలి, సరైన ఆహారం తీసుకోకపోవడం వల్లే డయాబెటిస్ వస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

సీతాఫలంలో యాంటీఆక్సిడెంట్లు, కెరోటినాయిడ్లు, ఫ్లేవనాయిడ్లు, విటమిన్లు సి, బి6, మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి. డయాబెటిస్ ఉన్నవారు అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తీసుకుంటారు. అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లలో సీతాఫలం ఒకటి. ఈ పండులో ఫ్రక్టోజ్ ఉన్నందున మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.


ఇన్సులిన్ వాడని మధుమేహ రోగులు సీతాఫలాన్ని మితంగా తినవచ్చు. 15 రోజులకు ఒకసారి తినడం వల్ల వారి చక్కెర స్థాయిలు మారవు. అయితే, ఇన్సులిన్ తీసుకునే మధుమేహ రోగులు ఈ పండు తినడం వల్ల వారి చక్కెర స్థాయిలు పెరుగుతాయి. ఈ తీపి పండు తినడం వల్ల వారి చక్కెర స్థాయిలు పెరిగితే, వారు మళ్ళీ వారి ఇన్సులిన్ స్థాయిలను పెంచాల్సి ఉంటుంది. అందుకే డయాబెటిస్ ఉన్నవారు ఈ పండు తినకూడదని సలహా ఇస్తారు.

మధుమేహం ఉన్నవారు తినకూడదు. ఒకవేళ తినాలనిపిస్తే మామూలుగా పండిన పండును మాత్రం తింటే ఎలాంటి బాధా ఉండదు. అదే ఎక్కువగా పండిన పండును మాత్రం తిన్నట్లయితే అందులో గ్లూకోజ్ శాతం ఎక్కువగా ఉండి, చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎక్కువగా హాని చేస్తుంది. అలాగే లివర్ వ్యాధితో, మూత్రపిండాల వ్యాధితో బాధపడేవారు సైతం ఈ సీతాఫలానికి దూరంగా ఉండాలి. అలాగే, ఆస్తమా ఉన్నవారు కూడా ఈ సీతాఫలంను తీనకూడదని నిపుణులు చెబుతున్నారు..

## టీమిండియా ఘోరంగా ఓడిపోయినా.. తెగ సంతోషపడుతున్న శుభమాన్ గిల్.

ఇంగ్లండ్ పర్యటనలో టెస్ట్ సిరీస్ ఎలా ప్రారంభమైందో, ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్ కూడా అదే విధంగా ప్రారంభమైంది. ఇది టీమిండియా కొత్త కెప్టెన్ శుభమాన్ గిల్ కథ. టెస్ట్, వన్డే కెప్టెన్‌గా, రెండు ఫార్మాట్లలో తన మొదటి మ్యాచ్‌లోనే గిల్‌కు ఓటమి ఎదురైంది. ఆస్ట్రేలియాపై పెర్త్‌లో జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు అన్ని రంగాల్లో విఫలమైంది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు ప్రభావవంతంగా కనిపించిన ఏ భాగం లేదు. అయితే, ఇంత ఘోర పరాజయం పాలైనప్పటికీ కొత్త కెప్టెన్ శుభమాన్ గిల్ పెద్దగా నిరాశ చెందలేదు. పైగా తాను ఏ విషయంలో సంతృప్తి చెందాడో కూడా చెప్పాడు.

వన్డే సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో భారత జట్టు బ్యాటింగ్ అత్యంత పేలవంగా కనిపించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు ఈ మ్యాచ్‌లో 136 పరుగులు మాత్రమే చేసింది. వర్షం కారణంగా నాలుగు సార్లు ఆగిపోయిన ఈ మ్యాచ్‌లో ఓవర్లను



26కి తగ్గించారు. అయితే భారత బ్యాట్స్‌మెన్లు ఏ దశలోనూ పూర్తి 50 ఓవర్లు ఆడేలా కనిపించలేదు. జట్టులోకి తిరిగి వచ్చిన స్టార్ బ్యాట్స్‌మెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ గిల్, వైస్-కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా పెద్దగా ఆడలేదు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు లభించిన లక్ష్యాన్ని కేవలం 22 ఓవర్లలోనే ఛేదించి విజయం సాధించింది.

టీమిండియా 7 వికెట్ల తేడాతో ఓటమిని ఎదుర్కొన్నప్పటికీ, కెప్టెన్ గిల్ ఆస్ట్రేలియాను సులువుగా గెలవనివ్వలేదనే విషయంలో సంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టు పేలవమైన బ్యాటింగ్, ఆ తర్వాత బౌలింగ్ గురించి మాట్లాడుతూ గిల్ ఇలా అన్నాడు.. "మీరు పవర్‌ప్లేలో 3 వికెట్లు కోల్పోయినప్పుడు ఎల్లప్పుడూ పుంజుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. ఈ మ్యాచ్‌లో మేము నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. కొన్ని పాజిటివ్స్ కూడా ఉన్నాయి. మేము కేవలం 130 పరుగులు మాత్రమే కాపాడుకోవాల్సి ఉంది. అయినప్పటికీ ఆటను చాలా దూరం వరకు తీసుకెళ్లాం. దీనితో మేము సంతృప్తి చెందాం." అన్నాడుడక్‌వర్త్-లూయిస్ పద్ధతి ప్రకారం ఆస్ట్రేలియాకు గెలవడానికి 26 ఓవర్లలో కేవలం 131 పరుగుల లక్ష్యం లభించింది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఆస్ట్రేలియాకు 22 ఓవర్ల వరకు శ్రమించాల్సి వచ్చింది. ఇది నిజమే. అయితే, దీనికి మరో కోణం కూడా ఉంది.. ఆస్ట్రేలియా జట్టు బ్యాటింగ్ చేసే సమయంలో ఒక్కసారి కూడా ఇబ్బంది పడినట్లు కనిపించలేదు. మిచెల్ మార్ష్ తన జట్టును ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులువుగా లక్ష్యం చేరుకునేలా చేశాడు. కాబట్టి, జట్టు మ్యాచ్‌ను చాలా దూరం వరకు తీసుకెళ్లింది అని గిల్ చెప్పడం అంతగా నమ్మదగింది కాదు. ఇప్పుడు కెప్టెన్ రెండవ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని ఆశిస్తున్నాడు.



Printed by katikala Vara Prasad. Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.